## జ్ఞానోదయం

ఆరోజు సాయంత్రం పరశురామ్ ఇంటికి వస్తూనే తలపట్టుకుని పడుకున్నాడు. "అమృతాంజనం రాయనా?" భార్య శ్యామల కాఫీ ఇస్తూ అడిగింది.

"ఊ"

"ఇవాళ కూడా అకౌంట్స్‌లో తప్పులొచ్చాయా?"

"చాలా! డే బుక్ ఎప్పటికీ టాలీ కాక తలనొప్పిరావడంతో వచ్చేసాను. రేపు టాలీ చెయ్యాలి" నీరసంగా చెప్పాడు.

బ్యాంకులో ఆఫీసర్‌గా పనిచేసే పరశురామ్‌కి అది రోజూ వుండేదే. అతడు పనిచేసే బ్యాంకు బ్రాంచి పెద్దది కావడంతో వ్యవహారాలు అధిక సంఖ్యలో వుంటాయి. అన్ని సెక్షన్ల నుండి వచ్చిన వోచర్లను డే బుక్‌లో పోస్ట్ చేసిన తర్వాత డే బుక్ డెబిట్, క్రెడిట్ టాలీ కావడంతో ఆ రోజు జరిగిన వ్యవహారాల అకౌంటింగ్ ట్రీట్‌మెంట్ పూర్తి అవుతుంది.

ప్రతి రోజూ ఎంత జాగ్రత్తగా చూసినా డే బుక్ టాలీ కాక అతన్ని చికాకు పెడుతోంది. అతడు ఆ సీట్లోకి కొత్త అయినా సరే, మాథమాటిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కావడం వలన, చిన్న చిన్న పొరపాట్లకు సైతం విపరీతంగా బాధపడి తలనొప్పి తెచ్చుకుంటాడు.

మగతగా నిద్ర పడుతుండగా భార్య ఎవరితోనో మాట్లాడడం లీలగా వినిపించింది.

"ఎనభైయారు రూపాయిల నలభై పైసలండి. పాత బాకీ పదిహేను రూపాయిలు. కలిపి నూటొక్క రూపాయిల నలభై పైసలు అయ్యింది" అది ఇస్త్రీ బట్టల మనిషి గొంతు.

"నేను లెక్కవేసి ఉంచాను. ఒకసారి పద్దు పుస్తకం చూస్తాను"

"అక్కర్లేదమ్మగారూ! నాను సరిగ్గానే చెప్పాను"

"ఏంటంత నమ్మకం? ఏ లెక్కలో పొరపాటు జరిగుండొచ్చుగా"

"మీ యిష్ట ప్రకారమే చూడండమ్మా!"

కాస్సేపు నిశ్శబ్దం.

"అరే! కరెక్టుగానే చెప్పావ్! అంత ఖచ్చితంగా లెక్కవేసి జ్ఞాపకం పెట్టుకుని మరీ చెబుతున్నావే? ఇంతకూ నువ్వేం చదువుకున్నావ్?" శ్యామల గొంతు ఆశ్చర్యంగా పలికింది.

"దీనికి పెద్ద చదువులెందుకమ్మా! రోజూ చేసే పనే గదా! కాయితాలూ, కలాలూ పట్టుకుని కూర్చుంటే మాకెలా నడుస్తాది! ఇదొక్కటే కాదు. ఇలా రెండొందల ఇళ్ళ బాకీలు నా నోటెమ్మటే గుర్తుంచుకుంటాను. రోజూ చేసే ఈ మాత్రం పనికి డిగ్రీ అక్కరలేదమ్మా!"

"సర్లే. ఇదిగో డబ్బులు"

మరో పది నిమిషాలకు బట్టలు వేసుకుని "బ్యాంక్‌కి వెళ్ళొస్తాను శ్యామూ! మా మేనేజరు ఇంకా ఆఫీస్‌లో ఉంటాడు. ఇవ్వాళ 'డే బుక్' టాలీ చేసి వస్తాను." అని చెప్పి వెళ్ళిపోయిన భర్తని చూసి విస్తుపోయింది శ్యామల.

—సోమయాజుల సోదరులు

